# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 322 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




### హిందీ రుద్దడంతో స్థానిక భాషలు

# సర్వనాశనం

**భోజ్‌పురి, బుందేల్ లాంటి భాషలు కనుమరుగు**

**మరోమారు హిందీపై అక్కసు వెళ్లగక్కిన స్టాలిన్**

**చెన్నై,ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం):** ఏకపక్షంగా హిందీ భాష విధింపుతో ప్రాచీన భాషలు ఉనికిలేకుండా పోతున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బలవంతంగా హిందీని రుద్దడం వల్ల 100 ఏళ్లనాటి 25 భాషలు నాశనమయ్యాయని గురువారం నాడిక్కడ అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లు హిందీ రాష్ట్రాలు కావని, ఆయా రాష్ట్రాలకు చెందిన వాస్తవ భాషలు ఇప్పుడు గతానికి సంబంధించినవిగా మారాయని అన్నారు. హిందీ యుపి ..మిగతా 2లో

### రెండు మూడు నెలల్లో టన్నెల్ పనుల

# పునఃప్రారంభం

**సహాయక చర్యల పూర్తికి యుద్ధప్రాతి పదికన చర్యలు**

**జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన బిఆర్ఎస్**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం):** రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభిస్తా మని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు.. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఎందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్దాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యతంగా ..మిగతా 2లో



### ఐక్యత కోసం జరిగిన

# మహా యజ్ఞం

**కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది**

**ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి**

**కుంభమేలా ముగింపుపై మోడీ వెల్లడి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా ..మిగతా 2లో



### తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

**మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె**

**వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొననున్న దేశాలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం):** మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీమణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ ..మిగతా 2లో

### ఎస్ఎల్‌బీసీ ఘటనపై

# సీఎం బాధ్యతారాహిత్యం

**సహాయక చర్యల్లో ఘోరంగా వైఫల్యం.. ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ.... ప్రాణాల మీద లేదు**

**హెలికాప్టర్ షోలకే సీఎం పరిమితం : మాజీ మంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం):** ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ బృందాలు, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం లోపించినట్టు కనిపిస్తుందన్నారు. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు ..మిగతా 2లో




### తెలంగాణ రైజింగ్‌ను

# ఎవరూ ఆపలేరు

**వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ**

**దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించాం**

**హెచ్‌సిఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):** దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని, 2025వ సంవత్సరంలోనే దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించామని, తెలంగాణ వన ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇవి, బయోటెక్ సహా తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రగామిగా ఉందని ప్రశంసించారు. మాదాపూర్‌లో ..మిగతా 2లో

# లెక్కలు చెప్పాల్సిందే..!

**ఇప్పటి నుంచి దేవాదాయశాఖకు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):** పాతబస్తీలోని ఛార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ హిందువుకూ ఓ సెంటిమెంట్. మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఆలయం కావడం వల్లనో, లేక కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవతగా పేరొందడం వల్లనో, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం దర్శానికి నిత్యం భక్తులు భారీగా తరలివస్తుంటారు. అంతేకాదు బీజేపీ కేంద్ర పెద్దలు అమిత్ షా, నడ్డా వంటి కీలక నేతలు సైతం హైదరాబాద్ వచ్చారంటే తప్పకుండా ఛార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోకుండా వెళ్లరు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం బీజేపీ నేతలకు ఆనవాయితీగా వస్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో పొలిటికల్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లకు, ప్రమాణాలకు భాగ్యలక్ష్మి ఆలయం వేదికగా మారింది. అంతలా హిందువుల సెంటిమెంట్ ఈ ఆలయంతో పెనవేసుకుని ఉంది. హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత ..మిగతా 2లో

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

**ఆరు స్థానాలకు ఉదయం పోలింగ్ ప్రారంభం.. 3న కౌంటింగ్...ఫలితాల ప్రకటన**



**హైదరాబాద్/విజయవాడ,ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం):** తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణల్లో మూడు చొప్పున 6 స్థానాల్లో గురువారం ఉదయం ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఏపీలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు ..మిగతా 2లో

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

**మొదటి పేజీ తరువాయి...**

జరుగుతున్నాయి. 16 జిల్లాల పరిధిలోని 1,062 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 70 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 6,84,593 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులునాయుడు (పీఆర్‌టీయూ), విజయగౌరి (యూటీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రధానంగా రాజశేఖరం (కూటమి) రాఘవులు (పీడీఎఫ్) మధ్య పోటీ ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బరిలో 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తెలంగాణలో ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గాలకు కలిపి 90 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడు స్థానాల్లో ఓటింగ్ కోసం 973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు

### బ్లూమ్‌బర్గ్ కథనంలో వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):** ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈవిషయాన్ని వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. ఇదంతా కూడా ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో భాగమని అంటున్నరు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి.

# రెండు మూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం

**మొదటి పేజీ తరువాయి...**

పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే.. ఆస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.. పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని..తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు. భారతదేశంలో టన్నెల్



ప్రమాదాల్లో అత్యంత నిపుణులను కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్దాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.




## తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

**మొదటి పేజీ తరువాయి...**

హెచ్‌సిఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. నూతన హెచ్‌సిఎల్ క్యాంపస్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారిందని కొనియాడారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఉద్యోగ కల్పనలో నంబర్‌వన్‌గా నిలిచామని చెప్పారు. ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు. 'తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు. మా పోటీ ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు.. కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక.. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను ఇటీవలే ప్రారంభించాం. ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సును నిర్వహించాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో ఆపరేట్ చేస్తోంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా పెద్ద స్థాయికి ఎదిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు, సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

## తెలంగాణలో మిస్‌వరల్డ్ పోటీలు

**మొదటి పేజీ తరువాయి...**



పెంచుతుంది. ఒక్కసారి ప్రపంచం దేశాలన్ని హైదాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకలకు సిద్ధమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతుంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ తర్వాత అందాల సుందరి కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది. గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారతస్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మెన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసారు. మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణుల అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇంక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టిపోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం.



## ఎస్ఎల్‌బీసీ ఘటనపై సీఎం బాధ్యతారాహిత్యం

**మొదటి పేజీ తరువాయి...**

చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పైనుంచి హెలికాప్టర్‌లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనదని.. క్షణం కూడా చాలా విలువైనదని తెలిపారు. సొరంగం లోపల ఆహారం లేక తాగునీరు లేక చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతున్నారని ఆదేవన వ్యక్తం చేశారు. వారి ప్రాణాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ కరువైందేమోనని అనిపిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కనీసం అక్కడికి వెళ్లి, ఒక డైరెక్షన్ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రి పూర్తిగా ఫెయిలయ్యారని ఆరోపించారు.తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ఇతరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

## హిందీ రుద్దడంతో స్థానిక భాషలు సర్వనాశనం

**మొదటి పేజీ తరువాయి...**

మాతృభాష కాదని, ఆ రాష్ట్ర ప్రాచీన భాషలైన భోజ్‌పురి, బుందేల్‌ఖండి (బుందేలీ) భాషలను కోల్పోయిందని అన్నారు. ఉత్తరాఖండ్ కుమావోనిని కోల్పోయిందని, రాజస్థాన్, హర్యానా, బీహార్, ఛత్తీస్‌గఢ్‌లలో స్థానిక భాషల ఉనికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతిని, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడికి దిగుతోందని మోడీ ప్రభుత్వానికి చురకలంటించారు. తమిళం పట్ల ప్రధాని మోడీకి గౌరవం ఉందన్న వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం ముగిసిన కుంభమేళాలో, తమిళ సంగమం (వారణాసిలో) సమయంలో హిందీయేతర భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. హిందీని విధించడంపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారు. ఏ రాష్ట్రంలోనైనా పాఠశాల విద్యార్థులు ఏ భాషనైనా నేర్చుకోవచ్చని సూచిస్తున్నారు. కానీ వాస్తవానికి తమిళాన్ని ఓ స్జబెక్టుగా అందించడం లేదని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా ఫార్ములా ప్రకారం అన్ని రాష్ట్రాలు సంస్కృతానికి ప్రాధాన్యత ఇస్తాయని అన్నారు. ద్రావిడ ఉద్యమం ద్వారా మాత్రమే తమిళం రక్షించబడుతుందని అన్నారు. అండమాన్‌లో తప్ప ఎక్కడా తమిళం నేర్పడం లేదని, కేంద్రీయ విద్యాలయాల్లో తమిళ భాషా ఉపాధ్యాయులు లేరని అన్నారు. పాఠశాలల్లో కనీసం 15 మంది విద్యార్థులు తమిళాన్ని ఎంచుకుంటేనే ఉపాధ్యాయులను నియమిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి చెప్పారని అన్నారు. రాజస్థాన్‌లోని పాఠశాలల్లో ఉర్దూ స్థానంలో సంస్కృత ఉపాధ్యాయులను నియమించారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, తమిళనాడు లోని అధికార డీఎంకేల మధ్య హిందీ భాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. '100 ఏళ్లలో ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పురి, మైథిలీ, బుందేలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా ఇలా అనేక భాషలు మనుగడ కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నాం. జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారు' అని స్టాలిన్ రాసుకొచ్చారు. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.మరోవైపు.. భాజపా, డీఎంకేల మధ్య వివాదం చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యానించారు.

## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం


**మొదటి పేజీ తరువాయి...**



వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

## వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు

### ఎస్ఎల్‌బీసీ వద్ద ఇంకా వీడని ఉత్కంఠ




**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం):** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబీఎం మిషన్ సమీపంలో పడి ఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించే పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్‌లలో తరలిస్తున్నారు. ఈరోజు మొత్తం ఇదే కార్యక్రమం సాగుతుందని.. బురద తీసాక పరిస్థితిని అంచనా వేసి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా అనేదానిపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని చెబుతున్నారు. ఒక వైపు బురద తొలగిస్తూనే మరో వైపు టీబీఎం మిషన్‌ను చిన్న చిన్న బాగాలుగా కట్ చేస్తున్నారు. ఈ భాగాలను కూడా వేరుచేసి బయటకు తీస్తున్నారు. ముందుగా రెండుకిలోమీటర్ల వద్ద బురదను క్లియర్ చేస్తున్నారు.

## లెక్కలు చెప్పాల్సిందే..!

**మొదటి పేజీ తరువాయి...**

విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం కూడా ఈ భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యూనల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మి ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే..1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మీ అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మీ ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మి ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం




ఉన్న భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. 1960 దశకం నుంచి వీరు ఆలయ నిర్వహణ భాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు ఇప్పటి వరకూ ఆలయ ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలను సేకరించడంతోపాటు భక్తుల విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపడంతోపాటు, ఒకవేళ అవకతవకలు జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని ట్రైబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో అంగరంగ వైభవంగా బుధవారం అర్ధరాత్రి శివ పార్వతుల కళ్యాణం

## గురువారం పుష్పాలంకరణలో దేవాలయ పరిసరాలు.. మహా అన్నదానంలో పాల్గొన్న వందలాది మంది భక్తులు



బుధవారం రాత్రి జరిగిన శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రణవ భక్త సమాజం సభ్యులు



స్వామీ వారి ఊరేగింపు



మహా అన్నదానానికి ముందు స్వామీ వారికి నైవేద్యం తీసుకువెళుతున్న భక్తులు



అన్నదాన కార్యక్రమం



వడ్డిస్తున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): ఆక్కన్న మాదన్నల కాలంలో 500 సంవత్సరాల క్రితం నిర్మించిన అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో బుధవారం రాత్రి 12 గంటల తర్వాత శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వందలాది మంది భక్తుల సమక్షంలో ప్రణవభక్త సమాజం సభ్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వర్లు వేద మంత్రోచ్చరణల మధ్య కళ్యాణ మహోత్సవాలు నిర్వహించారు. శ్రీశైలంలో రాత్రి 12గంటల తర్వాత కళ్యాణం నిర్వహించిన మాదిరిగానే రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలోనూ అర్ధరాత్రి తర్వాత కళ్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహ మూర్తులను దేవాలయం చుట్టురా ఊరేగించారు.

### శివాలయం ముందు శ్రీ ఆంజనేయస్వామీ దేవాలయం

శివాలయం ముందు ధ్వజ స్థంబం కు బదులుగా శ్రీ ఆంజనేయ స్వామీ దేవాలయం ఉండటం ఇక్కడ ప్రత్యేకత. ఈ మాదిరిగానే రామేశ్వరం లో ఉన్నట్లు భక్తులు చెబుతుంటారు. అందుకే ఇక్కడికి వచ్చిన భక్తులు రామేశ్వరానికి వెళ్లిన అనుభూతి పొందుతుంటారు. చిన్న అనంతగిరి లో శ్రీ ఉమా మహేశ్వర స్వామీ దేవాలయం భూగర్భంలో ఉన్నట్లు ఉంది. ఏకశిల పై జ్ఞానముద్రలో పరమశివుడు ఇక్కడ ప్రత్యేక ఆకరరణగా ఉన్నాడు. అభయ గణపతి దేవాలయం కూడా ఈ ప్రాంగణంలో ఉండటం విశేషం.

### ఆకట్టుకున్న పుష్పాలంకరణ

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా చిన్న అనంతగిరి శివాలయం ప్రాంగణంలో గురువారం ప్రణవ భక్త సమాజం ఆద్వర్యంలో చేసిన పుష్పాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

దేవాలయాలు, దేవాలయాల పరిసరాలలో పూలతో అందంగా అలంకరించిన తీరు కనువిందు చేసేదిగా ఉంది. దేవాలయ పరిసరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

### మహా అన్నదానంలో పాల్గొన్న వందలాది మంది భక్తులు


మహా శివరాత్రి మరుసటి రోజైన గురువారం చిన్న అనంతగిరి శివాలయంలో ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఈ మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ప్రణవభక్త సమాజం సభ్యులు తెలిపారు. శివ పార్వతుల కళ్యాణం, పుష్పాలంకరణ, మహా అన్నదానం కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ జాగ్రత్తలు తీసుకున్నారు. నాలుగురోజుల పాటు జరిగిన పూజా, భజన, ప్రవచన కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులకు ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మొండ్ర నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, సనివెల్లి క్రిష్ణ, కోశాధికారి ఎస్బీ హరినాథ్. కార్యదర్శి కొండమీది హరినాథ్, ముఖ్య సలహదారులు నారగూడెం మల్లారెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, కొలన్ సుభాష్ రెడ్డి, మొండ్ర కొమురయ్య, మ్యాడం మధుసూదన్, ప్రచార కార్యదర్శులు షాబాద విజయకుమార్, మొండ్ర ఐలయ్య, కార్యవర్గ సభ్యులు ఎస్.జయానంద్ రెడ్డి, ఎం.బాలు, శ్రీకాంత్, సులిగె వెంకటేశ్, గొరిగె రాజు పహిల్వాన్, పెంటల సుదాకర్ రెడ్డి, మ్యాడం రాము, సోమారం సురేశ్, ఎల్.వెంకటేశ్, షాబాద ఆనంద్, రావుల గండయ్య, రాచూరి రాజశేఖర్, రావుల జగన్, ఎం.రాజు, కె.ప్రసాద్, ఇ సహదేవరెడ్డి, ఎస్.రమేష్, బి.దయాకర్ లు దన్యవాదాలు తెలియజేశారు.









పుష్పాలంకరణలో ఆలయ పరిసరాలు

# పనులపై అవగాహన లేక ఇతరులపై నిందలు

## నిపుణులను సంప్రదించకుండానే ఎస్ఎల్‌బీసీ పనులు

## ఎస్ఎల్‌బీసీ ఘనటకు సీఎం రేవంత్‌దే పూర్తి బాధ్యత : కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): సీఎంకు ఏపని ఎలా చేయాలో తెలియక ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్ల నాటి ప్రాజెక్టు పనులను నిపుణులను సంప్రదించకుండానే ప్రారంభించారని, 8 మంది కార్మికులు టన్నెల్ చిక్కుకోవడానికి అదే కారణమైందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఇతరులను నిందించడం మానుకుని పనిపైన దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో 8 కార్మికులు చిక్కుకున్న ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను నిందించడంపై కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డికి పని చేతగాదని మండిపడ్డారు. 'ఆయనకు ఎలా పని చేయాలో తెలియకపోతే ఇతరులపై ఆరోపణలు చేయడం సులభంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల కిందటి ప్రాజెక్టు పనులను నిపుణులను, ఇంజినీర్లను సంప్రదించకుండానే మొదలుపెట్టారని విమర్శించారు. అదే ఇప్పుడు 8 మంది కార్మికులు టన్నెల్‌లోపల చిక్కుకోవడానికి కారణమైంది' అని కేటీఆర్ ఆరోపించారు.



ఉర్సు ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# గగన్ పహాడ్‌లో ఉర్సు ఉత్సవాలు

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): గగన్ పహాడ్‌లోని హజ్రత్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ ఉర్సు ఉత్సవాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ పాల్గొని పూలు సమర్పించారు. అనంతరం అక్కడ జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సరికొండ వెంకటేశ్, మహబూబ్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.



వైస్ చాన్సలర్‌లతో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేను సన్మాణిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిదులు

# రైతాంగం సంక్షేమం కోసం వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ వర్శిటీలు కలసి పనిచేయాల్సిన అవసరం ఉంది

## వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్ ను సన్మానించిన ఆత్మీయ సమావేశంలో వైస్ చాన్సలర్‌లు

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): రాష్ట్ర రైతాంగ శ్రేయస్సు ఉజ్వల భవిష్యత్తు కోసం వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయా విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు డాక్టర్ అల్దాస్ జానయ్య, డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్, డాక్టర్ దండ రాజిరెడ్డిలు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆద్వర్యంలో గురువారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలం వైస్ చాన్సలర్ గా నియమితులైన డాక్టర్ ఎం.జాన ప్రకాశన్ ను వ్యవసాయ విశ్వవిద్యాలయం తరపున వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మూడు విశ్వవిద్యాలయాలు కలసి పనిచేద్దాం అంటు సూచించారు. భవిష్యత్తులో ఉద్యోగులకు, విద్యార్థులకు కలసి క్రీడా పోటీలను నిర్వహించే ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ కొండా లక్షణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వెస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతు, తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచడానికి కృషి చేస్తున్నామని, అందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా సహకారం అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు, ప్రజలకు ఫౌష్టికాహార భద్రత ను సాదించవచ్చన్నారు. నూతనంగా భాద్యతలు చేపట్టిన పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్ మాట్లాడుతూ, పశు సంపదపై ఆదారపడి జీవిస్తున్న రైతుల జీవితాలలో వెలుగులు నింపడానికి కృషి చేస్తామన్నారు. అందుకోసం మూడు విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, ఉద్యోగులు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర రైతాంగం సంక్షేమం కోసం మూడు విశ్వవిద్యాలయాలు పనిచేయాలన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రులతో మాట్లాడి తీర్చడానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్ మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అద్యాపకులకు రావాల్సిన 2016 పీఆర్సీ బకాలు లను ఇప్పించడానికి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ తో పాటు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్యక్షుడు డాక్టర్ ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ, ఉద్యోగులు, ఆద్యాపకుల సమస్యలను పరిష్కరించడానికి వైస్ చాన్సలర్లు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ యాదవ్ ప్రసంగించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు బిక్షపతి, ఎస్. జయరాం. పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



# నేడు శ్రీ విద్యానికేతన్ హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం) : ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి బాబులెరెడ్డినగర్ లో గల శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ లో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ బోయ లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, రోబోటిక్, ఆర్ట్ గ్యాలరీ, ఎవాల్యుషన్ రంగాలలో విద్యార్థులచే ప్రదర్శనలు ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదం డ్రులు, స్థానికులు వచ్చి తిలకించవచ్చన్నారు.

# మార్చి 1న కళ్లద్దాల పంపిణీ

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): ఉప్పర్‌పల్లిలో ఈ నెల 12వ తేదీన చైతన్య సొసైటీ ఆద్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిభిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న 175 మం దికి మార్చి 1వ తేదీన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయడానికి ఆ సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉచిత వైద్య శిభిరంలో ఇచ్చిన కంటి అద్దాల చీటిని తీసుకుని వచ్చినట్లయితే కంటి అద్దాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9347572957, 8008900662 సెంబర్ లో సంప్రదించవచ్చన్నారు.



డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్ ను సన్మాణిస్తున్న డాక్టర్ ఆల్దాస్ జానయ్య, ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రం లో ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి లు

# వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.1000 కోట్ల గ్రాంట్ ఇవ్వండి

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలకి ఒకేసారి రూ .1000 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కి విజ్ఞాపన చేశారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో గురువారం వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాల ఉపకులవతులు, అధ్యాపకులు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల వెటర్నరీ విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా నియమితులైన డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తొలిసారిగా ఉపకులపతుల నియామకాలలో పూర్తి సామాజిక న్యాయం పాటించి చారిత్రాత్మక ముద్రవేశారని జానయ్య తెలిపారు. ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారిగా ఎస్సీ వ్యక్తిని ఉపకులపతిగా నియమించారని, పశువైద్య విశ్వవిద్యాలయానికి ఎంబీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ఉపకులపతిగా నియమించారని, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను వైస్ చాన్సలర్ గా నియమించారన్నారు. ఈ నియామకాలలో రాజ్యాంగబద్ధమైన సామాజిక స్ఫూర్తి రేవంత్ రెడ్డి పాలనలో స్పష్టమైనట్లు తెలుస్తుందని ఆన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.600 కోట్లు, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలకు రూ. 200 కోట్ల చొప్పున ఒకేసారి గ్రాంట్ అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరినట్లు డాక్టర్ జానయ్య తెలిపారు. తమకు నిధులు కేటాయిస్తే రూ.10వేల కోట్ల విలువ గల ప్రభావాన్ని చూపిస్తామని ముఖ్యమంత్రికి చెప్పినట్లు జానయ్య తెలిపారు. వ్యవసాయ విద్యా కోర్సులలో అమ్మాయిల సం ఖ్య 70శాతం గా ఉందని, వారికి వసతి గృహాల నిర్మాణానికి నిధులు ఇవ్వవలసిందిగా కోరానన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 335 టీచింగ్ పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గట్టిగా కోరినట్లు డాక్టర్ జానయ్య తెలిపారు. ఆ ఉద్యోగాల భర్తీ తమకు ఆత్యధిక ప్రాధాన్యతాంశమని అన్నారు. అద్యాపకుల పదవీ విరమణ పెంపుకు తాను అనుకూలం లేదా వ్యతిరేకం కాదన్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న తనకు అభ్యంతరం లేదన్నారు.



శ్రీ వీరభద్ర స్వామి ఉత్సవాలలో భక్తులు

## మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ వీరభద్ర సేవ కార్యక్రమాలు

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా వీరభద్ర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు గ్రామ నాయకులు, శివ స్వాములు పాల్గొని ప్రతి ప్రతి ఏడాది ఆనవాయితీగా నిర్వహించే ప్రత్యేక వీరభద్ర సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ శివాలయం నుంచి బస్టాండ్ బొడ్రాయి వరకు వీరసేవతో ఖడ్గాలతో కురుమ డోలు విన్యాసాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.



దంతనూరులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) దేవరకద్ర నియోజకవర్గం మదనపురం మండలం దంతనూర్ గ్రామంలో 78 లక్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీలు, సిసి రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించు కోలేదని... గ్రామాల అభివృద్ధికి సంబంధించిన నిధులను కాళేశ్వరం కు మళ్ళించి, లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే సంవత్సరానికి కూలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తుందన్నారు, బిఆర్ఎస్ పదేళ్ల పాలన లో దంతనూరు గ్రామంలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు, ఒక రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని, గ్రామాలలో అభివృద్ధి పడకేసిందన్నారు.ఒకవైపు బిఆర్ఎస్ చేసిన అప్పులకు.. మిత్తిలు కట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ... ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులతో పాటు 78 లక్షల నిధులతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామని తెలియజేశారు.



పాఠశాలకు దాతలు ఇచ్చిన వస్తువులను చూపిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

## ప్రభుత్వ పాఠశాలకు వస్తు సామాగ్రి వితరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం)హైదరాబాద్ కు చెందిన ఇన్ఫినిటి ఫిన్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో కేటిదొడ్డి మండలంలోని కొండాపురం జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలకు గురువారం రూ.2 లక్షల విలువైన వస్తు సామగ్రిని వితరణ చేశారు. ఆ సంస్థ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ నాగరాజు, బ్రాంచ్ మేనేజర్ మౌలాలి, కలెక్షన్ మేనేజర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలకు బీరువాలు, కుర్చీలు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, శ్యాండిల్స్, జామెట్రికల్ బాక్స్ లు, పెన్నులు, నోటు పుస్తకాలు, తదితర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రాథమిక విద్యా స్థాయి నుంచి పిల్లలు క్రమశిక్షణతో మెలుగుతూ విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానానికి చేరుకుంటారని పేర్కొన్నారు. గ్రామస్తులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర రావు, ఇంచార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పంప్ హౌస్ నుండి నీటి విడుదల

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) జూరాలకు కర్ణాటక నుండి సాగునీటిని విడుదల చేయడం వల్ల భీమా రెండో దశ తిరుమలాయపల్లి పంపు స్టేజ్ వన్ నుండి ఇప్పుడు సాయంత్రం అధికారులు వదిలారు. స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో అధికారులు సాగునీటిని ఏనుగుంట రిజర్వాయర్, శంకర్ సముద్రం రిజర్వాయర్కు నీటిని విడుదల చేశారు. నీటి విడుదల చేయడంతో కొత్తకోట మండలంలోని గ్రామాలలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫిబ్రవరి నెలలో ఏనాడు కూడా భీమ కాలువకు సాగునీరు విడిచిన సందర్భాల్లో లేవని తెలియజేశారు. రైతుల బాధలు దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే జిఎంఆర్ ముమ్మలపల్లె, మిరాశపల్లె, బూత్కూర్, ఉల్లంకొండ, వడ్డెవాట, చర్లపల్లి, నీటిని విడిపిచ్చడం వలన రైతులు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, కిరణ్, ముమ్మలపల్లి ఆంజనేయులు, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భీమ ప్రాజెక్ట్ రెండో దశ నుండి నీటిని వదలడంతో పరిశీలిస్తున్న నాయకులు

# గద్వాల ఎమ్మెల్యే మీ పార్టీ ఏది?

**మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానం చెప్పాలి?: నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీ? బీఆర్ఎస్ పార్టీ నుండి ఫిరాయింపుతో అనర్హత వేటు భయంతో గద్వాల ఎమ్మెల్యే "హైడ్రామా"**




సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం) బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అనర్హత వేటు భయంతో "హైడ్రామా" చేస్తున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ అన్నారు. గురువారం గద్వాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అభివృద్ధి పేరుతో ఓటు వేసి గెలిపించిన ప్రజలను అనేక రకాలుగా మోసం చేస్తున్నారని అన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల మీరు ఏ పార్టీలో ఉన్నారో బహిరంగంగా మీడియా ముందు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా ప్రతిష్టను, రాష్ట్ర వ్యాప్తంగా భంగపరిచి, గంగపాలు చేసేలా గద్వాల ఎమ్మెల్యే హైడ్రామా రాజకీయాలు చేస్తున్నారని, సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు అనర్హత వేటు పడుతుందన్న భయంతోనే రాజకీయ డ్రామాలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరలేదని చెప్తూ బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని, కావాలని దురుద్దేశంతో నా ఫోటోలను కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలో వేస్తున్నారని, ఈనెల 11వ తేదీన గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. మీరు నిజంగా బిఆర్ఎస్ పార్టీలో కనుక ఉంటే నేను బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని మీడియా ముందు ఎందుకు మాట్లాడటం లేదని, నిజంగా మీరు బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నట్లయితే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన "దీక్ష దివస్" కార్యక్రమానికి మరియు మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు ఎందుకు హాజరు కాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గద్వాల జిల్లాలో బహుజన నాయకత్వం ఎదగనీయకుండా గద్వాల ఎమ్మెల్యే బండ్ల పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతున్నారని, గద్వాల ఎమ్మెల్యే నిజంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నాడో లేదో జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి ప్రజలకు తెలుపాలని సూచించారు. ఈనెల 11వ తేదీన గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్లో స్వయంగా నా అనుమతి లేకుండా ఫ్లెక్సీలో నా ఫోటోలను వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంతకం చేయకుండానే ఫిర్యాదు చేసిన ఘటన వెనుక అంతర్యమేమిటో అర్థం కావడం లేదని పార్టీలతో పాటు జిల్లా ప్రజలు కూడా ఇలాంటి వ్యక్తుల గురించి ఆలోచన చేయాలని కోరారు. ఒక జేబులో బీఆర్ఎస్ పార్టీ కండువా, మరొక జేబులో కాంగ్రెస్ కండువా పెట్టుకుని గద్వాల ఎమ్మెల్యే బండ్ల తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. అవకాశం వచ్చినప్పుడు రెండింటిలో ఏదైనా వాడుకోవడంలో గద్వాల ఎమ్మెల్యే కు మాత్రమే సాధ్య పడుతుందన్నారు. గద్వాల నియోజకవర్గంలో బంగ్లాకు, బండ్ల లకు వ్యతిరేకంగా పని చేస్తున్నామని చెప్పినటువంటి సీఎం రేవంత్ రెడ్డి స్థానిక బీసీలకు టికెట్ ఇస్తే గెలుస్తారని తెలిసి, స్థానికేతరులకు టికెట్ ఇచ్చి బహుజన వాదాన్ని మంటగలిపిన నిజమైన ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. గద్వాల నియోజకవర్గంలో తన అనుమతి లేకుండా ఎవరు ఫ్లెక్సీలు వేశారో, వేసినా వ్యక్తులు ఎవరో ఏ పార్టీ వాళ్లు వేశారో, వాళ్లు నిజంగా కాంగ్రెస్ కార్యకర్తల కాదా అనే విషయాన్ని పూర్తి వివరాలు తెలియకుండా ఎమ్మెల్యే సంతకం లేకుండానే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం, పార్టీలో చేరానని గ్రామాల్లో ఉన్న ప్రజలను కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తూ, ఇంకో నాయకత్వాన్ని ఎదగనీయకుండా చేస్తూ సుప్రీంకోర్టులో వేసిన బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపుతో వేసిన కేసును ఎదురుకోలేక ఉప ఎన్నికలు వస్తే వాటిని ఎదుర్కోలేమనే భావనతో ఆడుతున్నటువంటి నాటకమే గద్వాల ఎమ్మెల్యే హై డ్రామా అని రాజకీయం తప్పా వేరే ఏమి కాదని తెలిపారు. దమ్ముంటే ఉప ఎన్నికలు ఎదుర్కోవడానికి సిద్ధపడాలని అన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు ఎంపీ మల్లు రవి గద్వాల ఎమ్మెల్యే మీ పార్టీ వ్యక్తి కానప్పుడు పదేపదే ఇంటికి వెళ్లి రావడం కారణమేమిటో ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, గద్వాల పట్టణ నాయకులు గౌని శ్రీనివాస్ యాదవ్, మల్దకల్,గట్టు ధరూర్ మండల అధ్యక్షులు బి.విష్ణు, బలరాం నాయుడు, నెట్టెంపాడు గోవిందు, మండల ఉపాధ్యక్షులు ప్రేమ్ రాజ్, అడవి ఆంజనేయులు, మల్దకల్, నాయకులు మీసాల కృష్టన్న, కె.పి. రామకృష్ణ, వెంకటేష్, లక్ష్మన్న, సర్వేష్, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 2న వనపర్తి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం) మార్చి, 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తి జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లపై ఐ.డి.ఓ .సి సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని, పర్యటనను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రారంభోత్సవాలకు శిలా ఫలకాల ఏర్పాటు, బహిరంగ సభకు కావలసిన ఏర్పాట్లను చర్చించారు. బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు బాధ్యతలను మున్సిపల్ కమిషనర్ కు అప్పగించారు.అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో, జిల్లాలో జరిగిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన - ప్రగతి బాట కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగించనున్న నేపథ్యంలో మహిళా సమాఖ్య, మెప్మ మహిళలను సభాస్థలికి సురక్షితంగా తరలించి తిరిగి వారి ఇళ్లకు పంపించడానికి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. మండలాల వారీగా బస్సులు కేటాయించడం జరిగిందని సభకు వచ్చే వారికి భోజనం, మంచినీరు, మజ్జిగ వంటి కనీస సౌకర్యాలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి సంచిత్ గంగ్వార్, యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, పి.డి. డిఆర్డీఓ ఉమాదేవి, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఓ లు తదితరులు పాల్గొన్నారు.



## రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ సంతోష్**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం) జిల్లాలో ఉపాధి అవకాశాలను పెంపొందిస్తూ, రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ.డి.ఓ.సి.వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. మార్చి 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తి జిల్లాకు రానున్న నేపథ్యంలో ఉద్యోగ మేళా, రుణ మేళా స్టాల్స్ ఏర్పాట్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో విద్యా, గృహ రుణాల మంజూరు తక్కువగా ఉండటంతో, వీటిని గణనీయంగా పెంచేలా బ్యాంకర్లు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రుణ పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు రుణాలను త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. మార్చి 2న ముఖ్యమంత్రి వనపర్తి జిల్లాకు రానుండగా, వనపర్తిలో ఉద్యోగ మేళా,రుణ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి 1న ఉద్యోగ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాకు జిల్లా నుండి ఎక్కువ మంది యువకులు హాజరయ్యేలా విస్తృత ప్రచారం చేయాలని, గ్రామ, మండల స్థాయిలో సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.రుణ మేళా కోసం బ్యాంకర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని,రుణ మంజూరు లక్ష్యాలు,ఇప్పటి వరకు మంజూరైన రూ.200 కోట్ల రుణాల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 2024 నుండి ఫిబ్రవరి 2025 వరకు మంజూరైన రుణాలపై పూర్తి స్థాయి నివేదిక రూపొందించాలని సూచించారు. రుణ మేళా,ఉద్యోగ మేళా కోసం ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నామని, ముఖ్యమంత్రి వీటిని సందర్శించి లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను, ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పోటెన్షియల్ లింకిడ్ క్రెడిట్ ప్లాన్ బుక్ విడుదల చేశారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లా మొత్తం రుణ సామర్థ్యం రూ.57,43,98.43 లక్షలుగా అంచనా వేయబడిందని తెలిపారు. వ్యవసాయం కోసం రూ.2,99,856.66 లక్షలు,దీర్ఘకాలిక పెట్టుబడులు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.1,94,657.34 లక్షలు రూపాయలు కేటాయించగా, ఎంఎస్ ఎంఈ(%మీవీజు%) రంగానికి రూ.6,06,000 లక్షల రూపాయల అంచనా వేశారని, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.19,284.43 లక్షలుగా రుణ సామర్థ్యాన్ని నిర్ణయించారని తెలిపారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావు, ఎల్ డి ఎం అయ్యపురెడ్డి,నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, జి.యం ఇండస్ట్రీస్ రామలింగేశ్వర్ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు, చేనేత సహాయ సంచాలకులు గోవిందయ్యా, మత్స్య శాఖ అధికారి షకీలా భాను, పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

**జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు**

**జిల్లాలో ఉత్తమ పని తీరును కనబరచిన జిల్లా షీ టీం**

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం) జిల్లాలో మహిళలు, యువతులు మరియు బాలికల పై జరిగే లైంగిక వేదింపులకు అడ్డుకట్ట వేసేందుకు పని చేస్తున్న జోగులాంబ గద్వాల్ పోలీస్ షీ టీమ్ జనవరి నెలకు గాను ఉత్తమ పనితీరును కనబరచి మల్టీ జోన్ -%××% జిల్లాలలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ మహిళల భద్రతకు తొలి ప్రాధాన్యతను ఇస్తూ వారికి వ్యతిరేకంగా జరిగే నేరాలపై తక్షణమే చర్యలు తీసుకోవడం తో పాటు మహిళలకు వారి హక్కులు, చట్టాల పై అవగహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఈవ్ టీజింగ్ కు అడ్డుకట్ట వేసేందుకు షీ టీమ్ బృందాల ద్వారా నిఘా వేసి నిందితులను పట్టుకొని తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా జిల్లా లో షీ టీమ్ బృందం గత జనవరి నెలలో 14 ఫిర్యాదులు స్వీకరించి ఈవ్ టీజింగ్ కు పాల్పడిన 13 మందిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని 1 ఎఫ్ఐఆర్ కేసు ,13 పెట్టి కేసులు నమోదు చేపించి జిల్లా లో గుర్తించిన హాట్ స్పాట్స్ ను తరచు సందర్శించడం ద్వారా మల్టీ జోన్ -%××% లోని 13 జిల్లాలలో షీ టీమ్ ఉత్తమ పనితీరును ప్రదర్శించి మొదటి స్థానం లో నిలవడం అభినందనీయం అని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా లో మహిళలు ఎలాంటి వేదింపులకు గురైన వెంటనే నిర్భయంగా పోలీస్ షీ టీమ్ ను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని, మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్,వాట్సాప్,ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని,వాటిలో ఫొటోలు,వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా లో ఎవరైనా వేధింపులకు గురైన షీ టీమ్ ను నేరుగా సంప్రదించలేని వారు "8712670312" ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608